ఈనాడు
ఖమ్మం
సోమవారం అక్టోబరు 14, 2024 5

వైభవంగా విజయ దశమి






ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి(దసరా) వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం వైభవంగా జరిగాయి. ఖమ్మం శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో అమ్మవారు సకల సంపద లక్ష్మీ, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీరాజరాజేశ్వరీ దేవీ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వేళల్లో అమ్మవారి దేవాలయాల్లో శమీ పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఖమ్మంలోని జమ్మిబండ వద్ద నిర్వహించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి పారు వేట ఆకట్టుకుంది. తొలుత శ్రీస్తంభాద్రి దేవస్థానం నుంచి స్వామి వారు అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, డప్పు నృత్యాల నడుమ పారు వేటకు బయల్దేరారు. నగరంలోని రేవతి సెంటర్, వైరా రోడ్డు, అంబేడ్కర్ సెంటర్ మీదుగా స్వామివారిని ఊరేగింపుగా జమ్మి బండ వద్దకు తీసుకొచ్చారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీపూజ వైభవంగా జరిగింది. ఏటా జరిగే నరకాసుర వధ కార్యక్రమాన్ని ఈ ఏడాది జరపలేదు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం దర్శించుకొన్నారు. గుట్టల బజారులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు.


మధిరలో భట్టి దంపతుల పూజలు


ఖమ్మం: స్తంభాద్రి గుట్టపై తుమ్మల..


కన్యకాపరమేశ్వరి ఆలయంలో పొంగులేటి


జమ్మి చెట్టుకు శ్లోకాలను కడుతున్న భక్తులు


మున్నేరులో అమ్మవారి విగ్రహం నిమజ్జనం

భద్రాచలం, న్యూస్‌టుడే

విజయదశమి వైభవం భద్రాచలం పుణ్యక్షేత్రంలో సాక్షాత్కరించింది. ఈనెల 4న ఆరంభమైన ఉత్సవాలకు శనివారం పూర్ణాహుతి పలికారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీరామ మహా పట్టాభిషేకం కొనసాగించారు. దసరా సంబరాలలో భాగంగా రామాయణ పారాయణం పూర్తిచేసి హోమం నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయం నుంచి బయల్దేరిన రాములవారు రాజవీధి నుంచి తిరువీధికి వేంచేశారు. దసరా మండపంలో శమీ పూజలు, శ్రీరామ లీలా మహోత్సవాన్ని నిర్వహించారు.

ఇల్లెందు, న్యూస్‌టుడే: ఇల్లెందు 'మినీ మైసూరు'ను తలపించింది. విజయ దశమి వేడుకలు శనివారం స్థానికి జేకే కాలనీలోని సింగరేణి క్రీడా మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ జానీ పాల్గొన్నారు. ఈటీవీ జబర్దస్ ఇమ్మాన్యుయేలు, నూకరాజు, ఫైమా బృందంతో పాటు హైదరాబాద్‌కు చెందిన నృత్య, మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.



ఇల్లెందు: దసరా వేడుకల్లో పాల్గొన్న జనం.. రథంపై దుర్గాదేవి ఊరేగింపు

కొలువుదీరిన కోటమైసమ్మ



కారేపల్లి, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీకోటమైసమ్మ జాతర శనివారం వైభవంగా మొదలైంది. వేడుకకు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు. వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్యలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకే కారులో బయల్దేరి వస్తుండగా.. జాతరకు సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్ వద్ద వాహనం ఒక్కసారిగా నెమ్మదించింది. దీంతో వెనుక నుంచి వచ్చిన మరో నాలుగు కార్లు ఒకదాన్ని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

కేఎంసీ ఉప కమిషనర్‌గా రాధిక?

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలక సంస్థ ఉప కమిషనర్‌గా ప్రస్తుతం అటవీశాఖలో ఎఫ్ఆర్ఓగా పని చేస్తున్న బెల్లం రాధికను నియమించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే సంబంధిత దస్త్రం సిద్ధమైన నేపథ్యంలో రెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో ఉప కమిషనర్‌గా పని చేసిన మల్లీశ్వరిని మెప్మా రాష్ట్ర కార్యాలయంలో డిప్యూటేషన్‌పై నియమించారు.

కన్నీటి మేట.. కలిగేనా ఊరట?

● పాలేరు, ఆకేరు, మున్నేరు పరీవాహకంలో.. 5 వేల ఎకరాల్లో రెండు పంటల నష్టం

కూసుమంచి, న్యూస్‌టుడే

కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం మండలాల్లో పాలేరు, మున్నేరు, ఆకేరు ఏటి పరీవాహక ప్రాంతాల్లో గత నెలారంభంలో ఉప్పొంగాయి. వరదలతో సుమారు 5 వేల ఎకరాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. నాట్లు వేసిన కొన్నాళ్లకే పెద్ద ఎత్తున పొలాలు ముంపునకు గురయ్యాయి. వాటిల్లో ఇసుక, రాళ్లు, చెట్లు గుట్టలుగా మేటలు వేసిన దృశ్యాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ఐదడుగుల మేర మేటలు పేరుకుపోయాయి. బాధిత రైతులకు పరిహారం నేటికీ దక్కకపోగా, ఖరీఫ్-రబీ రెండు పంటలూ నష్టపోయే పరిస్థితి. మేటలు తొలగించేదెన్నడు? మళ్లీ పొలాలను పూర్వ స్థితికి తెచ్చేదెన్నడు? అని అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఇటీవల వరదల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దసరా లోపే ఈ మొత్తాన్ని అందిస్తామని ప్రకటించినా అలా జరగలేదు. మరోవైపు.. ఇసుక, రాళ్ల మేటలు వేసిన పొలాలకు మెరుగైన పరిహారం అందేలా చూస్తామని పరామర్శల సందర్భంగా జిల్లా మంత్రులు రైతులకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత దీనిపై ఎలాంటి స్పష్టత, ప్రత్యేక ప్రకటన వెలువడలేదు. దీంతో రూ.10 వేలకు మించి పంట నష్టం సాయం దక్కకపోవచ్చని రైతులు దిగాలు చెందుతున్నారు.

రెండు విధాలా తీరని నష్టం

ఏటి ఒడ్డు పొలాల్లో నాలుగైదు అడుగుల మేర వేసిన మేటను తొలగించడం అంత సులువైన పనేంకాదు. ఇసుక, రాళ్లు, కూలిన చెట్లను యంత్రాల సాయంతో అడుగు వరకు తొలగించాలి. ట్రాక్టర్లతో బయటకు తరలించాలి. ఆ స్థానంలో నాణ్యమైన మట్టిని తెచ్చి చదును చేయాలి. గట్లు పటిష్ఠపరచాలి. ఇదంతా వచ్చే రబీ సీజన్ తర్వాత, ఎండాకాలంలో సాధ్యమయ్యేలా ఉంది. ప్రస్తుతం పై పొలాల్లోంచి నీటి ఊటలు రావడం, మట్టి కొరత ఉండటంతో వేసవి కోతల తర్వాతే ఓ రూపు రేఖకు తేవడం సాధ్యమని రైతులు యోచిస్తున్నారు. దీనివల్ల వానాకాలం, యాసంగి రెండు పంటలూ కోల్పోవాల్సి వస్తోంది. ఒక ఎకరాకు రెండు పంటలు కలిపి రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు మేటల తొలగింపునకు ఎకరాకు కనీసం రూ.25,000-రూ.50,000 వరకు భారం మోయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ చూపి న్యాయమైన పరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు.

★ సాంకేతిక లోపంతో నష్టపరిహారం బాధిత రైతుల ఖాతాలకు జమ కాలేదని, సమస్యను పరిష్కరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.


నాయకన్‌గూడెం వంతెన వద్ద పాలేరు ఏటి ఒడ్డున వరద బీభత్సం ఆనవాళ్లు


హట్యాతండాలో.. ఓ వైపు పొట్ట దశలో పొలాలు.. మరోవైపు ముంపున మేటలు..

సండ్ర కుమారుడి వివాహ వేడుక

సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పెద్ద కుమారుడు భార్గవ్ వివాహం ఆదివారం రాత్రి హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో జరిగింది. వివాహ వేడుకకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుసూదన్, పలువురు జిల్లా నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

– న్యూస్‌టుడే, ఖమ్మం కార్పొరేషన్



ప్రమాణాలు పాటించకుంటే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి: భట్టి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టే గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలను పాటించకుంటే తక్షణం అలాంటి వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, అవసరమైతే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో బాంబుపేలుళ్ల ధాటికి వెంగళరావునగర్‌లో దెబ్బతిన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. 2005 నుంచి ఓసీలో బాంబుపేలుళ్లతో చాలా ఇళ్లు బీటలు వారి, పెచ్చులూడటంతో ఉండలేకపోతున్నామని బాధితులు వద్ద ఏకరవు పెట్టారు. భట్టి మాట్లాడుతూ.. దెబ్బతిన్న ఇళ్ల సర్వే పూర్తి చేసి మరమ్మతులు చేయించాలని అక్కడే ఉన్న సీఎండీ బలరాంను ఆదేశించారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు క్రమంలో నిర్వాహకులతో తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకుని ఔట్‌సోర్సింగ్ ద్వారా వర్కర్లను నియమించుకోవాలన్నారు. తొలుత జగన్నాథపురం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆలయం, చర్చితో పాటు పలు అభివృద్ధి పనులను సీఎండీ, ఎమ్మెల్యేలతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, డాక్టర్ మట్టా దయానంద్, ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, పుర వైస్‌ఛైర్‌పర్సన్ తోట సుజలారాణి, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో పువ్వాళ్ల, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, సింగరేణి సీఎండీ బలరాం

మహిళల ఆర్థిక వృద్ధికే ఇందిరా డెయిరీ

ఎర్రుపాలెం: మహిళలు స్వయంశక్తితో ఆర్థిక వృద్ధి సాధించేందుకే ఇందిరా డెయిరీ ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎర్రుపాలెంలో డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శీతలీకరణ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి సభలో మాట్లాడారు. డ్వాక్రా సభ్యులు, వారి కుటుంబాలు పాడి పరిశ్రమ ద్వారా లాభాలు గడించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టును భారాస పట్టించుకోలేదన్నారు. ఆర్డీఓ గణేష్, డీఆర్డీఓ సన్యాసయ్య, జేడీఏ వేణుమనోహర్, తహసీల్దార్ ఉషాశారద పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్

ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల తలుపులు మూతపడనున్నాయి. గత మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. కళాశాలల నిర్వహణ భారమైందని, విధిలేకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉమ్మడి జిల్లా సంఘం బాధ్యులు పేర్కొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు 120 వరకు డిగ్రీ, పీజీ కళాశాలలుండేవి. ఆదరణ కొరవడటంతో మండల కేంద్రాల్లోని పలు సంస్థలను మూసివేశారు. ప్రస్తుతం కళాశాలలు సగానికి పైగా తగ్గిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న విద్యాలయాలకు ప్రభుత్వం నుంచి రీయంబర్స్‌మెంట్ సుమారు రూ.70 కోట్లకు పైగా రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే యాజమాన్య సంఘాలు తమ ఆవేదనను వెలిబుచ్చాయి. దీంతో గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో చెల్లింపులు చేస్తామని చెప్పిన ప్రభుత్వం సంబంధిత యాజమాన్యాలకు టోకెన్లు కూడా ఇచ్చింది. ఇంతలో ఎన్నికలొచ్చాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాతా తమ బాధలను ఉమ్మడి జిల్లాల కళాశాలల జిల్లాలకు యాజమాన్యాలు స్థానిక మంత్రులకు, జిల్లా కలెక్టర్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులకు సైతం పలుమార్లు విన్నవించారు. వారి నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. టోకెన్లు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. దీంతో కళాశాలలను మూసివేయడమే శరణ్యమని యాజమాన్యాలు ఇటీవల తీర్మానించాయి. ఈ సమాచారాన్ని ఆదివారమే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫోన్లకు సంక్షిప్త సమాచారం రూపంలో చేరవేశాయి. కాకతీయ వర్సిటీ, రాష్ట్ర ఉన్నతాధికారులకూ విషయాన్ని చేరవేశాయి.

"గత ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలకు కొంత మొత్తం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లింపునకు టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం వాటి చెల్లింపులు చేయాలి. మిగతా మొత్తాన్ని దశలవారీగా చెల్లించాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో కళాశాలల మనుగడ చాలా కష్టం. ఎంతోమంది పేద విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఆధారంగా చదువు కొనసాగిస్తున్నారు. అధ్యాపకులు, సిబ్బందికి నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్వాహకులు గోడు విని సమస్య పరిష్కరించాలి".


- మద్ది ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి ఖమ్మం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి

అనారోగ్య సమస్యలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఆస్తిపాస్తులకు కొదవలేదు. కానీ వార్ధక్యంలో అనారోగ్య సమస్యలు బాధిస్తుండటం, అవి బాగయ్యే అవకాశం లేదన్న మనస్తాపంతో వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాద ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన ప్రకారం ప్రకారం.. ఎర్రుపాలెం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ధనేకుల సాంబశివరావు(72), సరోజిని(65) దంపతులకు ఇద్దరు సంతానం. వారికి వివాహాలయ్యాయి. కుమారుడు లండన్‌లో ఉంటుండగా, కుమార్తె విజయవాడలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తాము ఇద్దరం అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి శనివారం రాత్రి సాంబశివరావు దంపతులు గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. తమను కుమారుడు, కుమార్తె బాగానే చూసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎవరెవరి నుంచి ఎంత రావాలి? ఎవరికి ఎంత ఇవ్వాలి, ఆస్తి పంపకాల వివరాలను అందులో పేర్కొన్నారు. ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలకు మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.



ధనేకుల సాంబశివరావు, సరోజిని (పాతచిత్రాలు)

పాపికొండల పర్యాటక బుకింగ్ ప్రారంభం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పాపికొండల ప్రకృతి అందాలను తిలకించేందుకు బోటు బుకింగ్ దసరా నుంచి ప్రారంభమైంది. భద్రాచలం నుంచి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పోచారం వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి గోదావరి నదిలో లాంచీలో వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకుగాను టిక్కెట్ ధర పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750గా ఉంది.

అరచేతిలో పత్తి కొనుగోళ్ల సమాచారం


ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఈ సీజన్‌లో పత్తి పంట కోతకొస్తోంది. రైతులు తెల్ల బంగారాన్ని విక్రయించాలంటే గతంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించేవారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. రైతు ఎప్పుడు సరకు తీసుకెళ్లాలనే సమాచారం నుంచి నగదు జమ వరకు సకల వివరాలు తెలుసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో పత్తి ప్రధాన పంటగా సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సీసీఐ అధికారులు వన్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో 'వాట్సాప్ టాప్ యాప్' రూపొందించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు దీన్ని అనుసంధానించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సీసీఐ కేంద్రాల కొనుగోళ్ల తాజా వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంచుతారు.

ఖమ్మం జిల్లాలోని సీసీఐ కేంద్రాలు

- జీఆర్ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వెంకటగిరి, ఖమ్మం గ్రామీణం
- శ్రీసాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్, తల్లంపాడు
- మంజీరా కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాటూరు (మధిర)
- అమరావతి టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెడ్, దెందుకూరు
- శ్రీశివగణేశ్ కాటన్ ఇండస్ట్రీస్, ఇల్లెందులపాడు
- ఉషశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్స్, సువర్ణాపురం (నేలకొండపల్లి)
- స్టాపిల్‌రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, తల్లాడ (వైరా డివిజన్)
- జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్స్, పొన్నెకల్లు, ఖమ్మం గ్రామీణం
- శ్రీభాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్, గోలితండ, తిరుమలాయపాలెం మండలం



- వానాకాలం సీజన్‌లో పత్తి రైతులు, దిగుబడి అంచనా వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు నమోదు చేశారు. ఆ సమాచారాన్ని సీసీఐ కేంద్రాలకు అందజేశారు. వ్యవసాయ శాఖ వద్ద వివరాలు నమోదు చేసుకున్న రైతులకే యాప్ అందుబాటులో ఉంటుంది.
- రైతులు తమ వద్ద ఎంత పత్తి దిగుబడి ఉంది? అనే వివరాలను తొలుత యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు స్థానికి సీసీఐ/జిన్నింగు మిల్లు పరిధిలో కొనుగోలుకు ఎంత సమయం పడుతుందో సమాచారం అందుతుంది.
- సీరియల్‌లో ఉన్న వాహనాల సంఖ్య, లోడింగ్, అన్‌లోడింగ్ వివరాలు ప్రత్యక్షం అవుతాయి.
- సరకు విక్రయించిన తర్వాత తక్‌పట్టీ వివరాలు, ధరల వివరాలు, నగదు ఎన్ని రోజుల్లో జమ అవుతుందో స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు.
- 'యాప్'లో వివరాలు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంటాయి.
- ఒకసారి పంట విక్రయించిన రైతులు.. తదుపరి చేతికందే పత్తి అంచనాను సైతం యాప్‌లో పొందుపరచవచ్చు. తద్వారా అధికారులకు కొనుగోళ్లపై ఓ అంచనా ఉంటుంది.

పత్తి కొనుగోళ్ల తాజా సమాచారం యాప్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తుంది. జిన్నింగ్ మిల్లుల్లో ఎన్ని వాహనాలు ఉన్నాయి? తమ సీరియల్ ఎప్పుడ వస్తుందో కూడా ఫోన్ ద్వారా తెలుసుకునే సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. రైతు తన సరకును ఇంటి దగ్గర్నుంచి తెచ్చుకుని వెంటనే అమ్ముకునే సౌలభ్యం కలుగుతుంది. నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలి. - ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం



వెండి మబ్బుల కనువిందు



నిండు కుండను తలపిస్తున్న పాలేరు జలాశయంలో మేఘాల ప్రతిబింబాలు కనువిందు చేశాయి. ఈ దృశ్యాన్ని వంతెన మీదుగా వెళ్లే వాహనదారులు కాసేపు ఆగి ఆసక్తిగా తిలకించారు. - ఈనాడు, ఖమ్మం

హంసల విన్యాసాలు అదరహో..!




కిన్నెరసాని పర్యాటక కేంద్రంలోని కొలనులో హంసలు (తెల్ల, నల్లని బాతులు) పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. వాటి విన్యాసాలను చిన్నారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. దసరా సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన పర్యాటకులు హంసల కొలను వద్ద సందడి చేశారు.
- ఈనాడు ఖమ్మం, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

రావి చెట్టు.. ఏనుగు తలను పోలినట్టు



ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద రహదారి పక్కనున్న రావిచెట్టు కాండం ఏనుగు తల ఆకృతిని పోలి ఉంది. అటుగా వెళ్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా చూస్తున్నారు.
- ఈనాడు, ఖమ్మం

కొబ్బరి కాయతో.. కళాకృతి..!



ఈ చిత్రాన్ని చూడండి.. వృద్ధుడి బొమ్మ ఆకట్టుకునేలా ఉంది కదా..! దీనికి ప్రత్యేకత ఉందండోయ్.. దీని కేవలం కొబ్బరి కాయ, చిప్పలతో తయారు చేశారు. ఆ బొమ్మను శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ వద్ద జరిగిన ఆయిల్‌పాం కిసాన్‌మేళాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రదర్శించారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.
- అశ్వారావుపేట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో వక్క సాగుకు కార్యాచరణ: తుమ్మల



పోలాసిగూడెంలో వక్క తోటను పరిశీలిస్తున్న తెలంగాణ మంత్రి నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిపుణులతో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో వక్క తోటల సాగుపై తగిన కార్యాచరణ చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పోలాసిగూడెంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. గ్రామంలో సాగుచేస్తున్న వక్క, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా వక్క సాగు చేస్తున్నారని, ఇది లాభదాయకంగా ఉందని రైతులు, నిపుణులు చెబుతున్నారన్నారు. తుమ్మల వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, పోలాసిగూడెం సర్పంచి మధు తదితరులున్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అక్కాతమ్ముళ్లు..

ఉపాధ్యాయ కొలువు సాధించారు!

పాల్వంచ విద్యా విభాగం, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే



అనిత, బన్సీలాల్

స్పష్టమైన లక్ష్యం.. చెదరని సంకల్పం ఉంటేచాలు.. విజయ సాధనకు పేదరికం అడ్డే కాదని నిరూపించారు ఈ అక్కాతమ్ముళ్లు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఆర్థిక అవరోధాలను తట్టుకొని నిలబడ్డారు. కానీ, కలల కొలువైన ఉపాధ్యాయ వృత్తిలో చేరాలన్న కాంక్షను ఎక్కడా వీడలేదు. పట్టుదలతో గమ్యం వైపు అడుగులు వేశారు. అహర్నిశలు శ్రమించి చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. వారే.. ఇల్లెందు మండలం కోయతండాకు చెందిన వాంక్‌డోత్ బాలు, బుల్లి తనయ అనిత, తనయుడు బన్సీలాల్.

అక్క అనిత, తమ్ముడు బన్సీలాల్ ఇద్దరికీ వివాహాలయ్యాయి. అయినా చిన్ననాటి నుంచి కలలుగన్న ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే ఆసక్తి మాత్రం వారిలో ఏమాత్రం తగ్గలేదు. ఒకే లక్ష్యం.. అదే బాటగా నిరంతరం ముందుకు సాగారు. గతేడాది నుంచి భవిత కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో బోధన చేస్తున్నారు. వారి అన్న రవికిరణ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)గా పనిచేస్తున్నారు. ఆయన కల్పించిన భరోసా, ప్రోత్సాహంతో గత డీఎస్సీకి సిద్ధమయ్యారు. ఇటీవల వెల్లడైన ఫలితాల్లో ప్రత్యేక విభాగం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టుల్లో అనిత 17, ఆమె తమ్ముడు బన్సీలాల్ 9వ ర్యాంకు సొంతం చేసుకున్నారు.

★ "ఉద్యోగ ప్రిపరేషన్ సమయంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. నాకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అయినా నా భర్త బాలాజీ సహకారంతో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ కొలువు సాధించడం సంతోషంగా ఉంది. సన్నద్ధతను పక్కా ప్రణాళిక ప్రకారం కొనసాగించా. సబ్జెక్టు ప్రాధాన్యాంశాల వారీగా సమయం విభజించుకుని పక్కాగా చదువుకునేదాన్ని. ఇప్పటికే నేను పినపాకలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం 'ఐఈఆర్‌పీ'గా పనిచేస్తున్నా. డీఎస్సీ కొలువు రూపంలో శ్రమకు తగిన ఫలితం దక్కిందని భావిస్తున్నా. అన్నయ్య రవికిరణ్ ఇల్లెందు మండలంలో భవిత కేంద్రాల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం మరువలేను". - అనిత

★ "ఉపాధ్యాయ ఉద్యోగ విజయాన్ని సాధించడంలో అన్నయ్య రవికిరణ్ చేసిన సాయం మరువలేనిది. అక్క అనితకు, నాకు అన్ని రకాలుగా తోడుగా నిలబడ్డారు. నేను గుండాల మండలంలోని భవిత కేంద్రంలో ఏడాదిగా కాంట్రాక్టు పద్ధతిలో ఐఈఆర్‌పీగా పనిచేస్తున్నా. నాకు భార్య నగ్మా, ఒక బాబు ఉన్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై.. తాజాగా డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశా. ఇన్ని రోజుల పడిన కష్టాలకు ప్రతిఫలం దక్కిందని అనుకుంటున్నా కాస్త ఆలస్యమైనా నీరసపడొద్దు. సాధించ గల లక్ష్యాన్ని ఏర్పరచుకుని శ్రమిస్తే విజయం దరిచేరుతుందనేందుకు మేమే ఓ ఉదాహరణ." - బన్సీలాల్

15న క్రికెట్ జట్టు ఎంపికలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 15న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్ 23 క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం బాధ్యుడు ఫారుఖ్ ఖాన్ తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 23 లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును సిద్ధం చేసేందుకు 15న నిర్వహించే ఎంపికల్లో 72 మంది క్రికెటర్లను ఎంపిక చేస్తామని, వారికి ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ఖమ్మం స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ లభించే ప్రతిభ ఆధారంగా తుది జట్టును ఎంపిక చేయనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్‌సీఏ నిర్వహించే అండర్ 23 లీగ్స్ నవంబరు 4వ తేదీ నుంచి మెదక్, సంగారెడ్డి, వరంగల్ నగరాల్లో జరుగనున్నాయని ఆసక్తిగల క్రీడాకారులు ఖమ్మం స్టేడియంలోని హెచ్‌సీఏ నెట్స్‌లో తనను సంప్రదించాలని ఫారుఖ్ ఖాన్ కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన మొడెం వంశీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వాజేడు మండలానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మొడెం వంశీ సౌత్ ఆఫ్రికాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. సౌత్ ఆఫ్రికాలోని సన్ సిటీలో ఈనెల 4 నుంచి 13 వరకు కామన్ వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో పవర్ లిఫ్టింగ్‌లో డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్, స్క్వాడ్ విభాగాల్లో మొత్తం 677.7 బరువు ఎత్తి మూడు స్వర్ణ పతకాలు, అత్యధిక స్కోరు చేసినందుకు మరొకటి మొత్తం నాలుగు బంగారు పతకాలు సాధించాడు. గతంలో వంశీ యూరప్‌లోని మాల్టాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ దేశం తరపున స్వర్ణ పతాకాన్ని సాధించిన సంగతి తెలిసిందే. వంశీకి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లేశ్, జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డి, పలువురు క్రీడాకారులు, వివిధ సంఘాల వారు అభినందనలు తెలిపారు.

దసరా వచ్చే.. సరదాలు తెచ్చే!

అమ్మవారి విగ్రహ ఊరేగింపులు.. శివసత్తుల నృత్యాలు.. రావణాసుర వధ ఘట్టాలు.. సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ ఏడాది దసరా ఊరూరా కొత్త శోభను తెచ్చింది. శరన్నవరాత్రుల ముగింపు వేడుకల్లో భాగంగా మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. విజయ దశమి సందర్భంగా ఆలయాల్లో పూజా కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



ఖమ్మం సాంస్కృతికం: కాల్వొడ్డు మున్నేరులో అమ్మవారి విగ్రహ నిమజ్జనం



మణుగూరు పట్టణం: సింగరేణి వేడుకల్లో నృత్య ప్రదర్శన...



ఇల్లెందు గ్రామీణం: పట్టణంలో జరిగిన ఉత్సవాల్లో మిమిక్రీ కళాకారుడి ప్రదర్శన



ఇల్లెందు: పట్టణంలో 'ఈటీవీ' 'జబర్దస్త్' కళాకారులు ఇమాన్యుయేలు, నూకరాజు, ఫైమా బృందం సందడి



ఇల్లెందు గ్రామీణం: నిజాంపేట కోటమైసమ్మ ఆలయంలో...



తల్లాడ: కళాకారులతో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



ఏన్కూరు: స్థానిక కోదండ రామాలయం ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన



కారేపల్లి: ఉసిరికాయలపల్లిలో కోటమైసమ్మ జాతరలో భక్తుల కోలాహలం



ఖమ్మం సాంస్కృతికం: గుట్టలబజారు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కళాకారుల వేషధారణలు..

పండుగ వేళ.. విషాద హేల

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

పండగ పూట పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. శని, ఆదివారాల్లో వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఐదురుగు మృతి చెందారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు...



కరకగూడెం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన కరకగూడెం మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాదన్నగూడెనికి చెందిన మడకం భద్రయ్య(60) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతవాడకు చెందిన హిమ్లా దేవా(27) దసరా ద్విచక్ర వాహనంపై కరకగూడెం వెళ్తున్న క్రమంలో రేగళ్ల మద్దులగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కరకగూడెం ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

కారు బోల్తాపడి ఒకరు..



కూసుమంచి, న్యూస్‌టుడే: కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డ సంఘటన ఇది.. వివరాలు పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం నగరం కస్బాబజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ వేడుకకు హాజరయ్యేందుకు ప్రైవేటు బస్సు, కారులో వెళ్లారు. తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కారులో సయ్యద్ మొయినొద్దీన్(57), అతని సోదరి హుర్ జహాన్, సమీప బంధువు మహ్మద్ అబ్దుల్ హమీద్ ఖాన్ ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ మహ్మద్ షఫీక్ అహ్మద్ అతివేగంగా నడపడంతో మునిగేపల్లి ప్రాంతంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వాహనంలో ఇరుక్కున్న మొయినొద్దీన్, హుర్‌జహాన్‌ను స్థానికులు, బస్సులో వెనక వచ్చిన వారి బంధువులు చాలా సేపు శ్రమించి బయటకు తీశారు. మొయినొద్దీన్ మృతి చెందగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి...



అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సర్పంచి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం పంచాయతీ సర్పంచి జగిడి బాలరాజు(34) స్వగ్రామం బర్లమడుగు నుంచి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మండలం నందిపాడు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం కిందపడి మృతి చెందారు. ఇతని భార్య కుక్కునూరు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు.

వాహనం అదుపు తప్పి సెక్యూరిటీ గార్డు...

కామేపల్లి, న్యూస్‌టుడే: ఇల్లెందుకు చెందిన గోకినేపల్లి శ్రీనివాస్(40) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు వెళ్లి ఖమ్మం తిరిగొస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తాలిపేరులో మునిగి ఇద్దరు యువకుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: గన్నవరానికి చెందిన ఇద్దరు యువకులు తాలిపేరులో పడి మృతి చెందారు. నిమజ్జనం కోసం బతుకమ్మలను శనివారం ఊరేగింపుగా గొంపెనగూడెం వద్ద తాలిపేరు నదికి తీసుకువచ్చారు. నిమజ్జనం అనంతరం యువకులు నదిలో స్నానానికి దిగారు. జంపన్న(20), సోయం మహిధర్(17) నది లోతులోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు బయటకు తీసి చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సీపీఆర్ చేసినప్పటికీ ఆ యువకుల ప్రాణాలు దక్కలేదు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.



గట్టుపల్లి జంపన్న



సోయం మహిధర్

కొడుకే.. కాలయముడై..!

తాగుడుకు డబ్బివ్వలేదని తండ్రినే చంపాడు

దమ్మపేట, న్యూస్‌టుడే: చెడు వ్యసనాలకు బానిసైన కొడుకు.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని గొంతు కోసి హత్యచేశాడు. పోలీసుల కథనం మేరకు.. వడ్లగూడేనికి చెందిన కంభంపాటి సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. డబ్బులివ్వాలని భార్య, కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవటంతో ఆదివారం వృద్ధుడైన తండ్రి కృష్ణయ్య(75)ను అడిగాడు. తన వద్ద లేవని ఆయన చెప్పటంతో కత్తితో తండ్రి గొంతు కోశాడు. కృష్ణయ్యను హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వివాహిత...

పినపాక: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన పినపాక మండలం జిన్నెలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఏడూళ్లబయ్యారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రజిత(25) ఇంటి ఆవరణలో ఆన్ చేసి ఉన్న వాటర్ హీటర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కిస్తీ కట్టలేక కాల్వలో దూకి ఆత్మహత్య



వెంకటనారాయణ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: నెలవారీ కిస్తీ చెల్లించలేక ఓ వ్యక్తి కాల్వలో దూకి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం ప్రకారం... వైరాకు చెందిన తాటికొండ వెంకటనారాయణ(50) నగర శివారు వైఎస్ఆర్ నగర్‌లో కొంతకాలంగా ఉంటున్నారు. వైరాలో బంధువులతో కలిసి ఆయన చీటీ వేసుకున్నారు. రెండు నెలలుగా చెల్లించకపోవడంతో వైరా నుంచి వచ్చిన బంధువులు వెంకటనారాయణ దంపతులను నిలదీశారు. బ్యాంకులో నగదు ఉన్నాయని తీసి ఇస్తానంటూ వారితో కలిసి వెంకటనారాయణ శుక్రవారం బస్సులో వైరా బయలుదేరారు. ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద ఆగిన సమయంలో బస్సు దిగిన ఆయన పరుగెత్తుకెళ్లి సాగర్ ప్రధాన కాల్వలో దూకారు. ఆయన మృతదేహాన్ని శనివారం వి.వెంకటాయపాలెం లాకుల వద్ద పోలీసులు గుర్తించారు. అన్నం శ్రీనివాసరావు బృందం వెంకటనారాయణ మృతదేహాన్ని ఒడ్డుకు తీసి ఆసుపత్రికి తరలించింది. ఆరుగురు బంధువులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

సత్తుపల్లి
• సత్తుపల్లి • మధిర • వైరా

'ప్రతి భారతీయునిలో దేశభక్తి ఉండాలి'



సత్తుపల్లి, న్యూస్‌టుడే: ప్రతి భారతీయుని హృదయంలో దేశభక్తి ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రముఖ్ ఎలమర్తి రమేష్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై వందో ఏట అడుగు పెడుతున్న సందర్భంగా సత్తుపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం పథ్ సంచలన్ (ప్రదర్శన) నిర్వహించారు. దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందుగా స్థానిక సత్యసాయి భవనం వద్ద పూజలు నిర్వహించి, ప్రతిజ్ఞ అనంతరం కవాతు నిర్వహించారు. ఆరెస్సెస్ సత్తుపల్లి నగర సంచాలకులు కోరుకొండ వెంకటేశ్వరరావు, దర్శపూడి రాజేష్, చింతల సుబ్బారావు పాల్గొన్నారు.

'నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు'

మధిర, న్యూస్‌టుడే: మరణానంతరం నేత్రాలను దానం చేయటం వల్ల ఇద్దరు కార్నియా అంధులకు చూపు ప్రసాదించవచ్చని ఖమ్మం నేత్రనిధి బాధ్యులు మాదవరపు నాగేశ్వరరావు పేర్కొన్నారు. మధిరకు చెందిన వేములపల్లి భూలక్ష్మిదేవి ఈ నెల 9న మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానమిచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం జ్ఞాపిక అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: చింతకాని- ప్రొద్దుటూరు రహదారిలో ఎన్నెస్పీ కాలువ సమీపంలో నడిరోడ్డుపై భారీగా కోడిపెంట వ్యర్థాలు కుప్పగా పోశారు. ఆ మార్గంలో వెళ్లేవారికి తీవ్ర దుర్వాసన వస్తోంది. రాత్రి సమయంలో మూలమలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. **రామకృష్ణ, చింతకాని**

సమాధానం: సంబంధిత వ్యక్తులతో మాట్లాడి అడ్డుగా ఉన్న కుప్పను తొలగిస్తాం. - రాంబాబు, పీఆర్, ఏఈ
- చింతకాని, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

పెనుబల్లి, న్యూస్‌టుడే: వీఎం బంజర లోని లక్ష్మీ పాఠశాల వీధిలో మురుగు కాలువ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. కార్యదర్శి రవిప్రసాద్ ఆదివారం పంచాయతీ సిబ్బందితో కాలువను తీయించి సమస్య పరిష్కరించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

సత్తుపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కిష్టారం ఓసీలో బాంబు పేలుళ్ల ధాటికి దెబ్బతిన్న ఎన్ఎస్, బీసీ కాలనీలోని ఇళ్ల స్థానంలో నూతన ఇంటి నిర్మాణాలకై విజయ దశమి నాడు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ మేరకు కొత్త ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. జీఎం షాలేంరాజు, మట్టా దయానంద్, పీవో నరసింహారావు, ఏఎంసీ ఛైర్మన్ ఆనంద్‌బాబు, అప్పారావు, శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

సత్తుపల్లి డెయిరీ తనిఖీ: సత్తుపల్లి విజయ డెయిరీ కేంద్రాన్ని ఎమ్మెల్యే రాగమయి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాల సేకరణ రిజిస్టర్లు పరిశీలించారు. పాల నాణ్యతను, నమోదు వివరాలను తెలుసుకున్నారు.

భక్తుల రద్దీ.. రాకపోకలకు అంతరాయం

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసరికాయలపల్లి శ్రీకోటమైసమ్మతల్లి జాతరకు ఆదివారం రాత్రి భక్తులు పోటెత్తారు. రాత్రి 9 గంటల నుంచి సుమారు వేలమందికిపైగా భక్తుల తాకిడి ఏర్పడటంతో ఇల్లెందు, కారేపల్లి వైపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆలయం ప్రధాన ఆర్చి నుంచి ఇల్లెందు సమీపంలో సోలార్‌ప్లాంట్, మరోవైపు ఆల్యాతండా వరకు కాలు మెదపలేని పరిస్థితి. సమస్యను పరిష్కరించేందుకు విధుల్లో ఉన్న పోలీసులకు ఇబ్బందులు తప్పలేదు. అదే సమయంలో అరగంటపాటు భారీ వర్షం కురవడంతో జాతరలో భక్తులు, దుకాణదారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

తీరు మారలేదు.. పేరు మారింది

పనులు పూర్తికాకుండానే పూర్తయినట్టు నివేదికలు

మధిర, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వం 'మన ఊరు.. మన బడి' పథకాన్ని తీసుకొచ్చింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో రూ.30 లక్షల్లోపు నిధులు మంజూరైతే వాటిని ఎస్ఎంసీ ఛైర్మన్ చేయాల్సి ఉంటుంది. రూ.30 లక్షలు దాటితే టెండర్ ప్రక్రియలో గుత్తేదారు చేపట్టాలి. మధిర నియోజకవర్గంలో మొత్తం 105 పాఠశాలలకు 'మన ఊరు.. మన బడి' నిధులు మంజూరయ్యాయి. వీటిలో 83 చోట్ల పనులు పూర్తయినట్టు నివేదికలు తయారుచేశారు. నిజానికి వారు పేర్కొన్న అన్నిచోట్లా పనులు పూర్తి కాలేదు. అసలు పనులు ప్రారంభించని 22 పాఠశాలలను కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం పేరు మార్చి, అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో చేర్చింది.

☆ మధిర మండలం టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శౌచాలయాలు బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్మించారు. తలుపులు ఏర్పాటు చేయలేదు. లోపల టైల్స్, డ్రైనింగ్ వాటర్ పంపుల సౌకర్యం లేదు. రంగులు వేయలేదు. దీన్ని పూర్తయిన జాబితాలో చూపారు.

☆ మధిర హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.25 లక్షలు కేటాయించారు. శౌచాలయాలు అసంపూర్తిగా నిర్మించారు. వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసినా సంపు నుంచి నీరు వచ్చేలా పైపులైన్ లేదు. తాగునీటి సదుపాయం కల్పించలేదు. కిటికీలు, బోర్డు బాగాని గేట్, నల్లాలకు డెస్కులు ఇవ్వలేదు.

☆ మధిర పంచాయతీరాజ్ ఏఈ కె.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 'మన ఊరు మన బడి' 21 పాఠశాలలకు నిధులు మంజూరైతే 18 పూర్తయినట్లు నివేదిక ఇచ్చామన్నారు. మిగిలినవి పూర్తిచేయిస్తామన్నారు.



టీవీఎం పాఠశాలలో అసంపూర్తిగా శౌచాలయ నిర్మాణం

మండలం	పాఠశాలలు	పూర్తయినవి	నూతన పథకంలో మార్చినవి
మధిర	21	18	3
ఎర్రుపాలెం	19	17	2
బోనకల్లు	15	08	7
చింతకాని	16	13	3
ముదిగొండ	34	27	7
మొత్తం	105	83	22

వైరా, న్యూస్‌టుడే

'మన ఊరు.. మన బడి' పథకం అమలు నామమాత్రంగానే మిగిలిపోయింది. కొన్నిచోట్ల పనులు పూర్తి చేయడం, మరికొన్నిచోట్ల మధ్యలోనే ఆగిపోవడంతో బిల్లుల చెల్లింపు సైతం స్పష్టత లేకుండా ఉంది. చాలాచోట్ల అరకొర బిల్లులు వచ్చాయంటూ గుత్తేదారులు వదిలేసిన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి.

☆ కారేపల్లి మండలం రొట్టమాకురేవు ప్రాథమిక పాఠశాలకు రూ.27 లక్షలు మంజూరు కాగా రూ.6 లక్షల పనులు చేపట్టారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పని వదిలేసి వెళ్లిపోయారు. బాజుమల్లాయిగూడెంలో విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీటి పనులు ఆరంభంలోనే ఆగిపోయాయి. ఈ మండలంలో ఏ ఒక్క పాఠశాలలోనూ పనులు పూర్తి కాలేదు.

☆ ఏన్కూరు మండలం బీజర్పురం ఉన్నత పాఠశాలలో అసంపూర్తి పనులు చేశారు. ఇక్కడ తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. రంగులు కూడా వేయలేదు. మండలం అంతటా ఇదే పరిస్థితి. ఏ ఒక్కచోటా పనులు పూర్తి కాలేదు. ప్రారంభించి వదిలేశారు.

☆ వైరా, కొణిజర్ల మండలాల్లో పలు చోట్ల పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా నమ్మశక్యంగా లేదు. వైరా మండలంలో అన్ని పనులు పూర్తయినట్లు ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తెలిపారు.



పనులు చేయని ఏన్కూరు మండలం బీజర్పురం ఉన్నత పాఠశాల

మండలం	మంజూరైన పాఠశాలలు	నిధులు (రూ.కోట్లలో)
ఏన్కూరు	16	1.86
కొణిజర్ల	19	2.30
కారేపల్లి	24	2.25
వైరా	16	2.4
మొత్తం	75	8.81

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ సోయం వీరాస్వామి(38) శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ని సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందించేలోపే మృతి చెందారు. వీరాస్వామి స్వస్థలం భద్రాచలం పట్టణం. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బెటాలియన్ కమాండెంట్ ఛటర్జీ, అధికారులు నివాళులర్పించారు.

నలుగురిపై కేసు

పెనుబల్లి, న్యూస్‌టుడ్: ఎస్సై వెంకటేశ్, తన సిబ్బందితో కలిసి ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ఎన్ఎస్పీ కాలువ కట్టమీద కొంత మంది గంజాయి తాగుతున్నారు. వెంబడించి వారిని పట్టుకున్నారు. నిందితులు టేకులపల్లి, రంగారావు బంజర్‌కు చెందిన కొప్పుల శివశంకర్, పొదిలి రాజేశ్, ముదురుకోళ్ల వీరబాబు, గొర్రాజు హరికృష్ణ నుంచి 170 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు మోటారు చోరీ

తల్లాడ: కొడవటిమెట్ట గ్రామంలోని తన పంట పొలంలో ఈ నెల 8న రాత్రి విద్యుత్తు మోటారు చోరీకి గురైందని రైతు నరసింహారావు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.కొండలరావు కేసు నమోదు చేశారు.

పిచ్చికుక్క స్వైర విహారం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: విజయ దశమి రోజున పిచ్చికుక్క సత్తుపల్లిలో స్వైరవిహారం చేసి దాదాపు 20మందిపై దాడి చేసింది. ఎండీ ఆసుపత్రి సమీపం నుంచి పాత సెంటర్ వైపు వెళ్తూ 20మందిపై ఎగబడి కాళ్లు, చేతులు, తొడల భాగంలో కరిచింది. స్థానికులు దాన్ని కర్రలతో కొట్టి హతమార్చారు. బాధితులను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

'దాత పూర్ణచంద్రారెడ్డి సేవలు అభినందనీయం'



భీమవరంలో ఇళ్ల పట్టాలు అందిస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు అందించిన దాత యరమల పూర్ణచంద్రారెడ్డి సేవలు మరువలేనివని అమ్మా ఫౌండేషన్ అధ్యక్షురాలు మల్లు నందిని పేర్కొన్నారు. భీమవరం గ్రామంలో యరమల పూర్ణచంద్రారెడ్డి వితరణతో ఎనిమిది మంది పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. బతుకమ్మ వేడుకల్లో నందిని పాల్గొని ఆడిపాడారు. పూర్ణచంద్రారెడ్డి బనిగండ్లపాడు గ్రంథాలయంలో రూ.12వేల విలువైన పుస్తకాలు వితరణ చేశారు. ఆయన్ని గ్రామస్థులు సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వి.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ శంకుస్థాపన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక హనుమాన్‌నగర్‌లో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ నిర్మాణ, పునఃప్రతిష్ట శంకుస్థాపన వేడుకను ఆదివారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, పుర ఛైర్మన్ కూసంపూడి మహేశ్‌లు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ప్రసాద్, నారాయణ, సురేశ్ పాల్గొన్నారు. ☆ నూతనకల్ గ్రామంలోని గంగదేవిపాడు సహకార సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయిని ఆదివారం కలిసి ఆహ్వానించినట్లు ఆ సంఘం ఛైర్మన్ తూము వీరభద్రరావు తెలిపారు.



శంకుస్థాపన పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బాబ్లా రచించిన బాలసాహిత్యం, పండగ అల్లుడు నాటిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

బాలసాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించిన భట్టి

మధిర, న్యూస్‌టుడే: మధిరకు చెందిన సాంస్కృతిక సారథి, రచయిత బాబ్లా రచించిన బాలసాహిత్యం నాటికల ఐదో పుస్తకం 'పండుగ అల్లుడు'ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. గతంలో బాబ్లా నాలుగు పుస్తకాలు విడుదలయ్యాయి. మధిర కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాణావత్ రమణ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి స్వాగతం

వైరా, న్యూస్‌టుడే: మధిర నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు స్థానిక క్రాస్ రోడ్డులో శనివారం ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించారు. వాహనం దిగిన భట్టి వారితో ముచ్చటించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి గుర్తింపు: పొంగులేటి

వైరా, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌కు అధికారం వచ్చేందుకు కష్టపడిన ముఖ్యనాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు వస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్ నివాసంలో శనివారం తేనీటి విందులో పాల్గొన్న అనంతరం చాలా సమయం గడిపారు. వైరా మాజీ సర్పంచి బొర్రా పద్మావతి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొర్రా ఉమాదేవితోపాటు వారి కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, మున్సిపాలిటీ ఛైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తేనీటి విందులో మంత్రి పొంగులేటి, మువ్వా, జైపాల్

'హక్కుల రక్షణ కోసం పోరాడిన సాయిబాబా'

వైరా, కొణిజర్ల, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ సాయిబాబా పోరాడారని సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల ఆదివారం కార్యాలయంలో సంతాపం ప్రకటించారు. స్టడీసర్కిల్ కన్వీనర్ బొంతు సమత, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, అమరేంద్ర, మధు పాల్గొన్నారు. ☆ ఆచార్య సాయిబాబాను కేంద్రంలో భాజపా ప్రభుత్వం తప్పుడు కేసులతో హింసించి హత్య చేసిందని న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో ఆరోపించారు.

గౌరారం టోల్‌ప్లాజా సిబ్బంది ధర్నా

పెనుబల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గౌరారం టోల్‌ప్లాజా సిబ్బంది శనివారం ధర్నా చేశారు. పది నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐను ప్రభుత్వానికి జమ చేయడం లేదని, యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని వాపోయారు. సిబ్బంది ధర్నాతో ఆ రహదారిలో వెళ్లే వాహనాలు టోల్ రుసుము చెల్లించకుండానే వెళ్లిపోయాయి. మేనేజర్ మాట్లాడుతూ... యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సిబ్బంది ఆందోళన విరమించారు.

ఆర్థిక సాయం

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లికి చెందిన కొప్పెర ధనమ్మ కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. భారాస మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ ఆదివారం నిత్యావసరాలతోపాటు ఆర్థికసాయం అందించారు. సత్యనారాయణ, ఖలీలుల్లాఖాన్ పాల్గొన్నారు.

తెదేపా సీనియర్ నేత మృతి

చింతకాని, న్యూస్‌టుడే: నరసింహాపురం గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు నన్నక రామారావు(70) ఆదివారం మరణించారు. పార్టీ జిల్లా నాయకుడు నన్నక గోపాలరావు, సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సామినేని రామారావు, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యుడు బయ్యన బాబూరావు రామారావుకు నివాళి అర్పించారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లులో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని, రైల్వే స్టేషన్ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తెదేపా మండల కమిటీ శనివారం వినతి పత్రం అందజేసింది. రైల్వే మూడో లైను పనుల దృష్ట్యా మండల కేంద్రంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, నాయకులు సాదినేని హనుమంతరావు, మైనేని రవి, బాజీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడి

కారేపల్లి: కారేపల్లిలో ఆదివారం వార సంతపై ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేశాయి. ఈ ఘటనతో సంతలో ఉన్నవారంతా ఉరుకులు, పరుగులు తీశారు. కారేపల్లి, బీక్యాతండా, తులిస్యాతండాకు చెందిన పలువురిని గాయపర్చాయి. బాధితులు స్థానిక వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. స్థానికులు కొందరు వరిగడ్డి కాల్చి పొగపెట్టడంతో ఈగలు వెళ్లిపోయాయి. ఇదిలా ఉండగా ఓ వ్యాపారికి చెందిన మేకపోతు ఈగల దాడిలో మరణించగా ఖమ్మంకు చెందిన మరో వ్యక్తిని తీవ్రంగా గాయపడ్డారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చేబ్రోలు సైదులు

బోనకల్లు, న్యూస్‌టుడే: భార్య చనిపోయిందని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయిన ఘటన ఆదివారం రావినూతలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. . చేబ్రోలు సైదులు(45), రాధ భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మూడు నెలల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. భార్య రాధ అవమానంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన సైదులు మద్యానికి బానిసయ్యాడు. పది రోజుల నాడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్సై మధుబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మూడు నెలల నాడు తల్లి, నేడు తండ్రి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.

ఘనంగా దసరా వేడుకలు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు శనివారం ముగిశాయి. దుర్గాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీ అమ్మవారి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రాంగణంలో సాయంత్రం వేళ శమీపూజ జరిపారు. ఆలయాన్ని దసరా పర్వదినమైన శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలకగా, శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. డీసీసీబీ డైరెక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వి.సుధాకర్‌రెడ్డి, బి.నరసింహారావు, ఏవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మధిరలో అమ్మవారి శోభాయాత్ర

మధిర, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందినితో కలిసి మంత్రి క్యాంపు కార్యాలయంలో వాహన పూజ చేశారు. సాయంత్రం వేంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. దుర్గామాత విగ్రహ నిమజ్జనం నిర్వహించారు. జమ్మిచెట్టుకు శమీ పూజ నిర్వహించారు. ఆదివారం బోనాలు సమర్పించారు.

వైరా, ఏన్కూరు, కొణిజర్ల, కారేపల్లి, న్యూస్‌టుడే: దసరా వేడుకలు వైరాలో ఘనంగా జరిగాయి. కోదండ రామాలయం, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, షిర్డిసాయి మందిరంతో పాటు గ్రామాల్లో బతుకమ్మ, దుర్గామాతకు పూజలు నిర్వహించారు. జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ☆ ఏన్కూరు మండలం గార్లఒడ్డు శ్రీలక్ష్మీనరసింహాస్వామి, నాచారం శ్రీఅద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గార్లఒడ్డులో భక్తులు గంటల తరబడి బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. గార్లఒడ్డు ఆలయ ప్రాంగణంలో రోజంతా వాహనాలతో రద్దీగా కనిపించింది. ☆ కారేపల్లి, కొణిజర్ల మండలాల్లో దేవిశ్రీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి మున్సిపాలిటీలో మనగుడి ప్రాంగణంలో అమ్మవారికి భక్తులు 108 నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సాయంత్రం సమయంలో రావణ దహనం చేశారు. జవహర్‌నగర్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. పుర ఛైర్మన్ కూసంపూడి మహేశ్ బాణంవేసి రావణ దహనం చేశారు.

వైరా, న్యూస్‌టుడే: స్థానిక హనుమాన్ బజార్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు.



కల్లూరు పుర వీధుల్లో అమ్మవారు, బతుకమ్మల ఊరేగింపు



వీఎంబంజర్: శ్రీకృష్ణ మందిరంలో ఏర్పాటుచేసిన విగ్రహ శోభాయాత్ర



విప్పలమడకలో కుంకుమ పూజల్లో మహిళలు



సత్తుపల్లి: అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



రాజరాజేశ్వరి అలంకరణలో



ఏన్కూరు రాజరాజేశ్వరీ మండపం వద్ద జమ్మిపూజ

అపూర్వ సమ్మేళనం

కల్లూరు, న్యూస్‌టుడే: కప్పలబంధం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 1957 నుంచి 2000 వరకు చదువుకున్న పలువురు సమావేశమయ్యారు. వీరిలో సత్తుపల్లి జడ్జి స్నేహ గోపాలరావు, విశ్రాంత ఈఈ జంగిలి దుర్గాప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త కర్నాటి వెంకటరెడ్డి, విశ్రాంత కమాండెంట్ ఎస్పీ గుమ్మడి సుబ్బారావు, హైకోర్టు అడ్వకేట్ జానకిరామారావు, ఉపాధ్యాయులు, ఇంజినీర్లు ఉన్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. ప్రస్తుత విద్యార్థుల ఉన్నత చదువులకు నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాస్తి శ్రీనివాసరావు, టి.పుల్లారావు, టి.రత్నారెడ్డి, ఏకే ఇస్మాయిల్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ గురువులను సత్కరించారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: భీమవరం వీవీఆర్ ఉన్నత పాఠశాలలో 2011-12లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 42 మంది విద్యార్థులు తమ మధుర స్మృతులు నెమరవేసుకున్నారు. సమ్మేళనంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

☆ భీమవరంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతులను సంక్రాంతి నరసింహారావు దంపతులు ఆదివారం సన్మానించారు. ఏఈ కావ్య, కానిస్టేబుల్ సుబ్బమ్మ, కె.లక్ష్మి, షేక్ ఫాతిమా, ఎస్.రత్నకుమారి, పి.నాగమల్లేశ్వరిలను శాలువాతో సత్కరించారు.



ఏన్కూరు: చిన్ననాటి గురువులతో పూర్వ విద్యార్థులు



కల్లూరు: ఉపాధ్యాయులతో కలిసి...

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

అన్నదాన మండపానికి భూమిపూజ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీధర్మ శాస్త్ర అన్నదాన సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన మండపానికి భూమిపూజ నిర్వహించారు. నగరంలోని చైతన్యనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర దేవాలయం సమీపంలో ఆదివారం గురుస్వామి పాకతిల్లం నారాయణ నంబూద్రితో భూమి పూజాది కార్యక్రమాలు జరిగాయి. అక్టోబరు 30 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు 41 రోజుల పాటు ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు ట్రస్టు ఛైర్మన్ మేకల హన్మంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి అట్లూరి మధు, కోశాధికారి టీవీ.పుల్లంరాజు, సభ్యులు చంద్రకిశోర్, నాగేశ్వరరావు, రవీంద్రబాబు, రవికుమార్, గోపిసందేశ్, దుర్గ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: మంత్రి తుమ్మల 14, 15న తేదీల్లో నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం రజబ్‌అలీ నగర్, ఎన్వీ బంజర, పంగిడి గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మంగళవారం 46 డివిజన్ సారథినగర్‌లో స్ట్రామ్ వాటర్ నిర్మాణం, హర్యాతండా, బద్యాతండా, రాంక్యాతండాలో సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: లకారంపై కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో నడకదారులకు ఇబ్బందిగా ఉంది: **ఓ పాఠకుడు**

సమాధానం: రెండు విద్యుత్ స్తంభాలు కూలడంతో సమస్య వచ్చింది. త్వరలో పునరుద్ధరిస్తాం: **కృష్ణలాల్, ఈఈ**

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

నగరంలోని కొత్తగూడెంలో పారిశుద్ధ్య పనులు జరగడం లేదని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పారిశుద్ధ్య పర్యవేక్షకుడు మల్లయ్యకు వివరించగా స్పందించిన ఆయన కాలువల్లో పూడిక తీయించారు.

✦ రాపర్తినగర్-2లోని వివేకానందనగర్ రోడ్ నెం.10లో వీధి దీపం వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తెచ్చారు. సమస్యను ఈఈ కృష్ణలాల్‌కు వివరించగా ఆయన ఆదేశాల మేరకు వీధి దీపాన్ని పునరుద్ధరించారు.

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

అంబరమంటిన దసరా సంబరాలు


నేలకొండపల్లి: ప్రదర్శనగా వెళ్తున్న ఉత్సవమూర్తులు


జమ్మిబండ వద్ద భారీగా తరలివచ్చిన భక్తులు


దానవాయిగూడెంలో అమ్మవారి పూజలో మహిళలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నగరంలోని ఆలయాల్లో శమీ వృక్షానికి పూజలు నిర్వహించారు. స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, ఐదవరనగర్ పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, ట్రంకురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, రోటరీనగర్ శ్రీరాజరాజేశ్వరి దేవాలయం, మయూరిసెంటర్ శ్రీసాయిబాబా మందిరాల్లో పూజలు నిర్వహించారు. జమ్మిబండ వద్ద శమీ పూజ వైభవోపేతంగా జరిగింది. ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

✦ దుర్గా దేవీ అమ్మవారి శోభాయాత్ర ఆదివారం కన్నుల పండువగా సాగింది. వివిధ రోజుల ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కాల్వొడ్డులోని మున్నేరు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. రెండు క్రేన్ల సాయంతో సుమారు 150 విగ్రహాలను నిమజ్జనం చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో లడ్డూ రూ.3,52,116 ధర పలికింది.

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో


కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరిగా...


అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

మహిషాసుర వధ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

దానవాయిగూడెంలో...

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగర శివారు దానవాయిగూడెంలో అమ్మవారి మండపం ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జనాలను ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

ఎమ్మెల్యే పూజలు: కామేపల్లి, న్యూస్‌టుడే: పింజరమడుగు పంచ పాండవుల దేవాలయంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ప్రతి ఏడాది విజయదశమి రోజున పంచ పాండవుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

నేలకొండపల్లి: నేలకొండపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, రాజగోపాలస్వామి దేవాలయం, భీమేశ్వరస్వామి దేవాలయాల వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, భక్తులు కోలాటాలతో నృత్యాలు చేస్తూ అలరించారు.

కూసుమంచి, న్యూస్‌టుడే: దుర్గామాత విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం వేడుకగా జరుపుకొన్నారు. కేశవాపురంలో శమీ రోజున సద్దుల బతుకమ్మ ఆడుతుంటారు. శనివారం సాయంత్రం స్థానిక రామాలయం ఎదుట ఈ వేడుక సాగింది.


మున్నేరులో అమ్మవారి విగ్రహం నిమజ్జనం


పారువేట స్థలం జమ్మిబండ వేదికపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీనర్సింహ స్వామి


కామేపల్లి: పింజరమడుగు పంచ పాండవుల దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య


కూసుమంచిలో దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు


ఖమ్మం రైల్వేస్టేషన్ రోడ్డులో అమ్మవారి శోభాయాత్ర


కామేపల్లి: పంచ పాండవుల ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న యువత


వీవీపాలెంలో శోభాయాత్రకు సిద్ధమైన అమ్మవారి విగ్రహం


పర్ణశాల రామాలయంలో శమీ పూజలు చేస్తున్న అర్చకులు

కారు ఢీకొని 15 గొర్రెలు మృతి



కూసుమంచి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు ఢీకొని 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కాసాని వెంకన్న తన జీవాలను మేపుతూ సర్వీసు రోడ్డు మీదుగా ఇంటికి వస్తుండగా వాహన హారన్ చప్పుళ్లకు బెదిరి ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి దూసుకెళ్లాయి. అదే సమయంలో వేగంగా వస్తున్న కారు గొర్రెల మందను ఢీకొనడంతో 15జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలకాపరి ఫిర్యాదుతో కూసుమంచి ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు.

నిరంతర లీకేజీ...



నగరంలో ఇల్లెందు ప్రధాన రహదారిపై ప్రభుత్వ డిగ్రీ, యూనివర్సిటీ పీజీ కళాశాల మధ్యలో సుదీర్ఘకాలంగా మంచినీటి పైపు లైన్లు లీకేజీ కొనసాగుతోంది. నీరు రహదారిపైకి రాకుండా గాడి కొట్టి కాలువలోకి మళ్లించడం విశేషం. దీంతో ఈ లీకేజీ కాస్తా ఎవరికి కనిపించకుండా పోయింది. రోజు వేల లీటర్ల నీరు మురుగు కాలువలోకి వెళ్తున్నా సంబంధిత సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి దాన్ని తీసుకెళ్లకపోవడం గమనార్హం. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నివాసాలు పెరుగుతున్నా మట్టి రోడ్లే శరణ్యం



నగరంలోని ఖానాపురంలోని శివారు ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. అందుకనుగుణంగా ఇంటి నిర్మాణాలు జోరందుకున్నాయి. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో ఇప్పటికి మట్టిరోడ్లు, గుంతల రహదారులు ఉండడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారుల్లోనైనా సీసీ రహదారులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నీరు వృథా కాకుండా...



కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు తెగిపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో ఖానాపురంలోని ఓ ఇంటి వద్ద తెగిన రెండు పైపులకు ప్లాస్టిక్ సీసాలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం అందరికి ఆదర్శంగా మారింది. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మేఘ సందేశం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలో కొన్ని వారాలుగా వింత వాతావరణం ఉంటోంది. ప్రచండమైన ఎండ, అంతలోనే మబ్బులు, కాసిన్ని చినులు, మళ్లీ ఎండాకాలాన్ని తలపించే వేడిమి... మారిన ఈ వాతావరణం నగరంలోని జన జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. రోజువారి పనులకు వెళ్లే వారు, కార్మికులు, కూలీలకు, పరీక్ష కాలంగా మారింది. ఆదివారం మెరిసే మబ్బుల నీడన కనిపించిన నగర చిత్రమిది.



ఎంపీ బలరాం నాయక్ పరామర్శ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ నగరంలోని బాలపేట తండాలో ఆదివారం సాయంత్రం పర్యటించారు. స్థానికుడు భూక్యా కృష్ణరాథోడ్ తల్లి మంగమ్మ సెప్టెంబరు 21న మృతి చెందారు. కృష్ణ నివాసాన్ని ఎంపీ సందర్శించారు. మంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కృష్ణ కుటుంబాన్ని ఎంపీ బలరాంనాయక్ పరామర్శించారు. ఎంపీతోపాటు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.


ఆచార్య కృష్ణని పరామర్శిస్తున్న ఎంపీ బలరాంనాయక్

317 జీఓ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 317 జీఓ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ మధిరలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ జీఓతో ప్రభావితమైన కొంతమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు సొంత జిల్లాలో కాకుండా సుదూర ప్రాంతాలైన ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మహబూబ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు డి.రవికుమార్ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అమ్మవారి మండపం వద్ద వాగ్వాదం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నవరాత్రుల సందర్భంగా నగర మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద శనివారం రాత్రి స్వల్ప వాగ్వాదం జరిగింది. మండపం వద్దకు వచ్చిన ఇతరులు గొడవ పడటంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలిసి విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి బ్రహ్మతేజ, నగర బాధ్యుడు వనపర్తి సాగర్ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండపం వద్దకు వెళ్లిన మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

పీడీఎస్‌యూ పోరాట పాట ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పీడీఎస్‌యూ పోరాట చరిత్రపై ప్రజా రచయిత కోమిరా వెంకన్న రాసిన పాటను నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, కాకి భాస్కర్ హాజరై పాటల సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడుతూ... విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి శాస్త్రీయ విద్యా సాధనకు సమ సమాజం కోసం స్వప్నించిన పీడీఎస్‌యూ 1974లో ఆవిర్భవించిందని తెలిపారు. నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆవుల అశోక్, పూర్వ విద్యార్థులు రాయల రవికుమార్, మనోహర్, విజయ్, సుగుణారావు, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, ప్రస్తుత పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర మాజీ కోశాధికారి మందా సురేశ్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


పాటల సీడీని ఆవిష్కరిస్తున్న పోటు రంగారావు, నాగన్న

పేదలకు దుస్తులు పంపిణీ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గాంధీచౌక్‌లోని శ్రీవరప్రదాత షిర్డీసాయి బాబా మందిర కమిటీ ఆధ్వర్యంలో శనివారం పేదలకు నూతన దుస్తులను వితరణగా అందజేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, సభ్యులు కురువెళ్ల వెంకట జగన్మోహన్‌రావు, పీవీడీ ప్రసాద్, కాకరపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు...

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో పలు డివిజన్లలో మున్నేటి వరద సమయంలో పని చేసిన పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. 48వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట రామారావు, తోట లక్ష్మణ్‌లు, 52వ డివిజన్‌లో కార్పొరేటర్ బుర్రి వెంకటేశ్వర్లు, భారాస యువజన విభాగం నాయకుడు బలుసు మురళీకృష్ణ డివిజన్లలోని పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు.


పేదలకు దుస్తులను అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

స్టేషన్‌లో ఆయుధ పూజ

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం గ్రామీణ ఠాణాలో శనివారం ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు.

బావను కత్తితో పొడిచిన బావ మరిది

కూసుమంచి: వేడుక క్రమంలో తలెత్తిన వాగ్వాదం, బావను కత్తితో పొడిచే వరకూ వెళ్లింది. ఈ ఘటన బికారితండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. రమేశ్, రవి స్వయాన బావ, బావ మరుదులు. ఆదివారం వేడుక సందర్భంగా చిన్న విషయమై వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో రవి క్షణికావేశంలో తన బావ రమేశ్‌ను కత్తితో పొడవడంతో చంక కింది భాగంలో గాయమైంది. చికిత్స నిమిత్తం ఖమ్మం సర్వజన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామానికి చెందిన బొడ్డు శ్రీను తన బైక్‌పై శనివారం రాత్రి ఖమ్మం వెళ్తుండగా గుర్రాలపాడు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. శ్రీనుకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. శ్రీను కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఏలూరి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని టీఎన్జీఓ భవన్‌లో టీఎన్జీఓ సంఘం జిల్లా కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి ఉద్యోగ ఐకాస పునర్నిర్మాణ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు సబంధించి 50 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 11 ఆర్థికపరమైనవి కాగా మిగతావి పాలన, సాంకేతికపరమైనవని వివరించారు. సప్లిమెంటరీ బిల్స్ రూ.3 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ ఇప్పటికే వచ్చి ఉంటే ఒక్కో ఉద్యోగికి రూ.20 వేలు జీతం పెరిగేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, హెల్త్ కార్డుల అంశాలపై చర్చించారు. నవంబరు 3న జిల్లాలోని సకల ఉద్యోగుల కుటుంబాలతో ఖమ్మంలో కార్తీక వన భోజనాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఉద్యోగ ఐకాస రాష్ట్ర వైస్ ఛైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నర్సింహారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పుల్లయ్య, టీఎన్జీఓ సంఘం నాయకులు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు సహా వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ ఐకాస రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు

పూర్వ విద్యార్థుల కలయిక



నేలకొండపల్లి, న్యూస్‌టుడే: బోదులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత శనివారం పాఠశాలలో వారంతా కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అకాల మరణం చెందిన తమ మిత్రులకు నివాళి అర్పించారు. డా.అనంతు నవీన్, తుమ్మా ఉపేందర్, ఎలుగూరి వీరభద్రం, గోనె వెంకటేశ్వర్లు, పరకాల శ్రీనివాస్, ఉమ, స్వప్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య సాయిబాబా మృతికి సంతాపం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఆచార్య సాయిబాబా మృతికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైలు నుంచి విడుదలైన కొద్ది రోజులకే సాయిబాబా మరణించడం విషాదకరమని పేర్కొన్నారు.

✦ సాయిబాబా మృతి దళిత, మైనార్టీ, పేద, కార్మిక వర్గాలకు లోటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబా మృతికి మాస్‌లైన్ జిల్లా కమిటీ తరపున సంతాపం తెలియజేశారు.

✦ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ నగర్‌లోని జిల్లా కార్యాలయంలో ఆచార్య సాయిబాబా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్డీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాముల మోహన్‌రావు, గిరి, రవి, వెంకటేశ్వర్లు, మస్తాన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

✦ సాయిబాబా మరణంపై సీపీఐ జిల్లా సమితి సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలో సినిమాలు.. **శ్రీనివాస:** వేట్టయన్, **సీఎన్ సినీ గెలాక్సీ:** మా నాన్న సూపర్ హీరో **శ్రీ తిరుమల:** దేవర పార్ట్-1, **వినోద:** జనక అయితే గనక, **శ్రీసాయిరాం:** విశ్వం, **కేపీఎస్:** మార్టిన్, జోకర్(రెండు ఆటలు)

పండగ వేళ.. అనుకోని అతిథి

కూసుమంచి, న్యూస్‌టుడే: దసరా పండగ.. కుటుంబ సభ్యులు సరదాగా గడుపుతున్న సమయం.. అంతలోనే అతిథి ఇంటికి వస్తున్నారనే సమాచారం.. కొద్ది సేపటికే ఆయన రాక.. ఇదీ కూసుమంచిలోని పారిశ్రామికవేత్త దండాల లక్ష్మణరావు కుటుంబంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న సంఘటన. అతిథిగా వచ్చిన వ్యక్తి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. పండగ రోజు నియోజకవర్గంలోని పలువురి నివాసాలకు వెళ్లి ఆప్యాయత పంచుకున్నారు. కూసుమంచిలో లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.


దండాల లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గ్రామీణ దారులకు మహర్దశ

రఘునాథపాలానికి రూ.16.86 కోట్లు మంజూరు



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో అంతర్గత రహదారులు ఇక సిమెంటు రోడ్లుగా మారనున్నాయి. దీంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సిమెంట్ కాంక్రీట్(సీసీ)తో సైడ్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. ఇందుకోసం జాతీయ ఉపాధి హామీ పథకంలో 404 పనులకు రూ.16,86,50,000 పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి మంజూరయ్యాయి. ఖమ్మం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి గత ఆగస్టులో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు పంపారు. ఆమె ఆమోదంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేనందున ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటుంది. పనులు పూర్తి చేసిన తర్వాత ఇరువురి జాయింట్ బ్యాంక్ ఖాతాకు నిధులు జమ అవుతాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ, డీఈ, ఈఈలు పనులను పర్యవేక్షించనున్నారు. వచ్చే మార్చి 31 తేదీలోగా పనులు పూర్తి చేసేందుకు గడువు విధించారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులు హడావుడిగా ఫిబ్రవరిలో మంజూరు చేసి మార్చిలో ముగించాలని చెప్పేవారు. దీంతో పనులు సకాలంలో పూర్తి చేయలేకపోయేవారు. నాణ్యత అంతంత మాత్రంగానే ఉండేది. ఈసారి ఆర్నెల్లు ముందుగానే నిధులు మంజూరు కావటంతో నాణ్యతతో పనులు పూర్తి చేసే అవకాశం వచ్చింది. ఈ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరుసగా శంకుస్థాపనలు చేస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయనున్నట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.